# సుబ్బారావు సన్మానం



**బలివాడ వెంకటదామోదరరావు**

సుబ్బారావుకి సన్మానం!

నేడే—

ప్రముఖ రచయిత, రచయితల సమాఖ్య అధ్యక్షుడు అయిన సుబ్బారావుకి సన్మానం.

సుబ్బారావు ఎంత యెదిగిపోయాడు? రచయిత కావాలని తహతహలాడి చేసిన ప్రయత్నం భంగపడగా బెంగపడిపోయిన సుబ్బారావు ఈనాడొక ప్రముఖ రచయిత.

నేను గుర్తుండి ఉంటానా? ఏమో? ఏడాది పరిచయం. అదయినా అయిదేళ్ళ క్రిందట...

అప్పుడు—

నేనేనాడూ హోపైనా వెళ్ళని శ్రీకాకుళం నాకు ట్రాన్స్‌ఫరైంది. శ్రీకాకుళం చిన్న పట్టణమే అయినా నాలాంటి టెలిఫోన్ ఆపరేటర్‌కి— ఒంటరి బ్రహ్మచారికి (బ్రహ్మచారి ఒంటరిగా కాక జంటతో ఉంటాడా) హో చిన్న రూమ్‌లాంటిది దొరకటం (అద్దెకే సుమండీ) కష్టం అయ్యింది. ఆ సందర్భంలో నేను గదికోసం తిరుగుతుండగా ద్వారకలో (అదిగో ద్వారకలోని ద్వారక కాదండోయ్... ఇది గ్రాండ్‌ట్రంక్‌రోడ్‌లోని గ్రాండైన కాఫ్యాలయం) టీ సేవిస్తుండగా విచిత్రంగా సుబ్బారావుతో పరిచయమైంది. నా అవసరాన్ని అతనికి విన్నవించుకున్నాను.

అతనంతా విని తాపీ (మేస్త్రీలా)గా అన్నాడు:

'నేనిక్కడ ప్రజాపనుల శాఖలో పన్జేస్తున్నాను. (ప్ర. ప. శా. అంటే పి. డబ్ల్యు. డి. ట) బ్రహ్మచారిగానే. రూమ్‌లో ఒంటరిగా ఉంటున్నాను. (బయట ఒంటరిగా ఉండటం లేదేమోనన్న అనుమానం నాక్కలిగినా అడగలేదు) నాతోపాటుండటానికి మీ కభ్యంతరం లేకపోతే నాకూ లేదు.'

నే నొప్పుకున్నాను. (కోవాలి మరి— తప్పదు!)

అయితే హోటల్‌లో సాగిన ఆ పది నిముషాల సంభాషణలోనూ—నాకు సుబ్బారావులో, అతని మాటల్లో ఏదో తెచ్చిపెట్టుకున్న ఆవేశం కన్పించినట్లనిపించింది. మంచి 'డైలాగులు' మాట్లాడాలనే ఆరాటం స్పష్టంగా ద్యోతకమైంది. చిన్న మాటల్ని కూడా సాగదీసి బరువైన (ఎన్ని కే.జీ.లో చెప్పలేను) సంభాషణలుగా ట్రాన్స్‌ఫార్మ్ చేసి చెప్పాడు. నా కప్పుడది వింతగా అనిపించినా అర్థం కాలేదు.

'మీ పేరు?' రూంలో లగేజితో అడుగు పెడుతున్న నాకు సుబ్బారావు మొదటి ప్రశ్న—

నేను చెప్పాను.

నా పేరు వినగానే నా వంక ఆశ్చర్యంగా చూస్తూ, క్షణంసేపు నోరు తెరచుకొని ఉండిపోయాడు. అంతలో రెండు దోమలు మొఖంముందు తారట్లాడగా, శనివారం మాంసభక్షణ కూడదనుకొన్నవాడై, నోరు మూసుకొని, ఆశ్చర్యంనుండి తెప్పరిల్లి, పెదాలుతెరచి (మాట్లాడాలిగా) 'ప్రముఖ రచయిత ముదువర్తి మధుమూర్తిగారు...?' సగంలోనే ఆపేశాడు అనుమానంగా.

'నేనే' సందేహనివృత్తి చేస్తూ, నెమ్మదిగా, సహజంగా అన్నాను కాస్తంత గర్వం మిళితంచేసి.

'ఐసీ...మీరు నా రూమ్ మేట్ కావటం నిజంగా నా అదృష్టం.'

* * *

క్రొత్తలో నాలుగైదురోజులు ఎప్పుడూ నా కథలని, రచనల్ని తెగపొగిడేవాడు. తనక్కూడా రచయిత కావాలనుందట. చిట్కాలు చెప్పమన్నాడు. రచన వ్యాపారమా? నవ్వి ఊరుకున్నాను.

ఓ ఆదివారం—

తెలుగు సినిమా (నేను చూస్తున్నది) బోర్ కొడితే సగంలోనే వచ్చేశాను. నెమ్మదిగా దగ్గరగావేసిఉన్న రూం తలుపులను నిశ్శబ్దంగా (అఫ్‌కోర్స్ అని ఎప్పుడూ చప్పుడు కావనుకోండి) త్రోసుకొని లోప

లికి ప్రవేశించాను.

గదంతా దట్టంగా పొగ అలముకొని ఉంది. సిగరెట్ పొగ. గట్టిగాపట్టి దుమ్ము పీలుస్తున్నాడు సుబ్బారావు.

టేబిల్‌మీద కాగితాలు—చేతిలో కలం—కుర్చీలో కూర్చొని. పైకప్పును పరిశీలిస్తున్నాడు. (వాసాలు లెక్కించటంకోసం మాత్రంకాదని నేను బల్లగుద్ది చెప్పగలను.)

ఏదో థాట్ తట్టినట్లుంది—

గబగబా కలంతో ఏదో బరుకుతున్నాడు.

నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. సుబ్బారావేనాడూ ఏదీ వ్రాయటంకాని, [కనీసం ఆఫీసు ఫైల్సుకాని, మిత్రులకు ఉత్తరాలుకాని]—ఇలా దీర్ఘంగా ఆలోచించటంకాని నేనీ నెల్లాళ్ళలోనూ చూళ్ళేదు.

నాకో చిన్నజబ్బుం(డే)ది.

పొడిదగ్గు — ప్రీవియస్ నోటీసివ్వకుండానే వచ్చేస్తుంటుంది. లైన్లో ఉన్న సమయాల్లో కూడా అడపాదడపా నన్ను వంకరిస్తుంది. కొందరు ఫోన్ చేసిన వాళ్ళు — వాళ్ళు రింగ్ చేసింది ఎక్స్‌చేంజికో, టి. బి. వార్డుకో తెలీక తికమక పడుతుంటారు. (రేమో !)

ఆల్‌రైట్—కీపిట్ ఎసైడ్—

సరిగ్గా అప్పుడే నాకు పొడిదగ్గు వచ్చింది. రెండు మూడుసార్లు — మధ్య మధ్య కాస్త విరామంతో, వీక్లీలో సీరియల్‌లా. దగ్గగా— సుబ్బారావు కాస్త చలించి నావంక చూశాడు!

'హల్లోగురూ! సిన్మా బాగులేదా?' మాటల్లో సిన్సియారిటీ ధ్వనిస్తూ, తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, తను వ్రాస్తున్నదేమీ కానట్లే, నెమ్మదిగా కాగితాలను మడిచేశాడు. అది నటన—నేను గుర్తించాను.

అతనడిగిన ప్రశ్నకు నేను జవాబు చెప్పలేదు.

'ఏమిటి గురూ, అది?' అన్నాను.

'అబ్బే...బ్బే...ఏం లేదు' కంగారుగా టేబిల్ సొరుగులో దాచేశాడు. సిగ్గుపడుతూ...సిగ్గు...!

'ఇవ్‌లేటరా?'

'నాకా అదృష్టంలేదు.' భగ్నహృదయుడిలా, ప్రేమోపహతుడిలా, విరక్తజీవిలా—ఎ. ఎన్. ఆర్. పోజులో అన్నాడు. మరోడైతే అతన్నా పోజులో చూసి, ఆ డైలాగువిని బాబుగారు గతంలో ఏదో పెద్దదెబ్బ తిన్నాడనుకోక మానడు. కాని —నో... నో... సర్! అలాంటిదేమీలేదని బాండ్ రాసివ్వగల్ను. చెప్పాడుగా! సీరియస్‌గా డైలాగడం (అంటే డైలాగులు చెప్పటం అని అతనే అర్థం చెప్పాడో సారి) అతనికో సరదా!

'నేను చూడకూడదా?'

కాస్సేపు ఆలోచించి, తలపంకించాడు సుబ్బారావు. కాగితాలు బైటకితీసి చూపించాడు.

కథ... !

సుబ్బారావు కథ వ్రాస్తున్నాడు...

ఆహో...శ్చర్య పోయాను.

'అరె! నువు కథలుకూడా వ్రాస్తావా?' (వ్రాయగలవా అని అంతరార్థం) ఈ ప్రశ్నతో కుంచించుకు పోయాడు సుబ్బారావు. ఎందుకో?

'ఏదో సరదాకి. పులిని చూసి నక్కవాత మాత్రంకాదు.' అబ్బ! చెప్పుతో కొట్టినట్లు అన్నాడు. అందులోనే 'నిన్ను చూసి వ్రాయాలన్న దుగ్ధమాత్రంకాదు సుమా' అన్న ఆత్మాభిమానం...

'నో నో...తప్పకుండా వ్రాయిగురూ! అంతులేని వింతభావాలను మనసులోనే ప్రోగుచేసి దాచుకోనేకంటె కలంతో కాగితంపై పేర్చి వాటికోరూపు కల్పించుకోవాలని ప్రయత్నించటం ఎంతో మంచిది' ఎంకరేజ్ చేస్తూ అన్నాను.

రోజులు గడిచాయి.

...క్రమంగా సుబ్బారావు నాదగ్గర తాను దాచిన ఒకేఒక రహస్యం (తాను రచనలు చేస్తుంటానని) వివరాలు వివరంగా, విపులంగా ఒక్కటొక్కటే బైటపెట్టసాగడు.

ఓ సోమవారం సుప్రభాతాన తన లెదర్ సూట్‌కేస్‌కి ప్రక్కనేఉన్న త్రుప్పుపడుతున్న చిన్నమెటల్‌ట్రంక్‌లోనుండి కాగితాల కట్టలుతీసి చూపించాడు. అన్నీ సుబ్బారావు స్వీయరచనలే.

ఐదేళ్ళక్రిందటిమాట—కాని సుమారు ఇరవై వీశల కాగితాలన్నా ఉండిఉంటాయని నా గుర్తు.

ప్రతికాగితాన్నీ పరిశీలనగా పరీక్షించసాగాను—సుబ్బారావు కథల్ని. సాహిత్య రచనలు, సాంఘిక కథలు, (ట్రాజెడీలు ఎక్కువ) పౌరాణికాలు, కాల్పనిక జానపదాలు, శృంగారకథలు — ఒకటేమిటి? రకరకాల కథలు—సెటైర్‌నిండిన వ్యంగ్య రచనలు, గేయాలు, సగం వ్రాసి ఆపేసిన నాటకం. రెండు నవలలు—(అన్నీ వ్రాతప్రతులే) ఉన్నాయి.

అందంగా, గుండ్రంగా ఉంటుంది సుబ్బారావు దస్తూరీ. అతని ఓపికకి ఆశ్చర్యం వేసింది.

ఇక్కడో చిన్నరహస్యం—

ఎక్కడా అనకండి (ఇప్పుడు సుబ్బారావు పెద్దరచయిత కనుక) కాని, అవన్నీ తిరిగొచ్చేసిన రచనలే. రకరకాల పత్రికల ఆఫీసులు చూసివచ్చేశాయి. అయినా సుబ్బారావులోని పట్టుదలగాడు మా చెడ్డ మొండిఘటం—చూశారూ, ఎప్పటికైనా నెగ్గకపోతానా అని!

అప్పటికి నా కర్థమైంది సుబ్బారావు నెలకి యాభైరూపాయలు తిరిగి ఇంటి నుండి ఎందుకు తెప్పించుకుంటాడో! (ఈపాటికి మీ కర్థమైపోయుంటుంది లెండి—నెలకో వందరూకల పైచిలుకు రచనల పోస్టేజి, స్టేషనరీకోసం సుబ్బారావు ఖర్చుచేస్తాడని ఇఫ్ సో—యు ఆర్ రైట్ మాస్టారూ)

స్థూలంగా సమీక్షించాలంటే నేను పరిశీలించిన కట్టల్లో (అప్పటికి వివిధపత్రికాధిపతులు పరిశీలనలోనంటూ ఇంకా తిరిగి రానివి రమారమి పాతిక రచనలున్నట్లు సుబ్బారావు అన్నాడు. అవి మినహాయించి) ముప్పయితొమ్మిది కథలు, నలభైరెండు గేయాలు, ఇరువొక్కటి వ్యాసాలు. పద్దెనిమిది సినిమా విమర్శలు, అరనాటకం, రెండు నవలలు ఉన్నాయి. (నా డైరీలో ఈ అంకె లిప్పటికీ ఉన్నాయి.)

వీటి సమీక్షకు నాకు పక్షంరోజులు పట్టింది. ఇందులో కనీసం నూరు శాల్తీలైనా ఒక్కొక్కటి సగటున కనీసం ఆయిదేసి మాగజైన్ల ఆఫీసులు దర్శించి, సదరు కార్యాలయాల్లో చెత్తబుట్ట పాల పడకుండా, (తిరుగు టపాకోసం స్టాంపున్న స్వంత చిరునామా కవర్లు పంపటం

వాళ్ళ), నిరక్షితంగా సుబ్బారావును చేరుకున్నాయి.

పరాజయం సుబ్బారావులో మరింత పట్టుదలను పెంచింది.

ఓసారి సుబ్బారావు నాతో అన్నాడు:

'నిజం చెప్పాలంటే గురూ, నాకు మీ పేరున్న రచయితల్ని చూస్తే అసూయ, అసహ్యం (!) పుడుతోంది. అది ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సునుండి జనించిందో, నా ప్రయత్నాలు ఫలప్రదం కాకపోతున్న నైరాశ్యంనుండి పుడుతోందో చెప్పలేను.' ఏదైతేనేం, రచయిత కావాలని తాపత్రయ పడుతున్న ప్రతి ఒక్కడి ఆంతర్యాన్ని స్పష్టంగా, నిష్కర్షగా, నిర్మొహమాటంగా చెప్పాడు.

ఇంకోరోజు ఓ పేరుపొందిన పత్రికలో ఓ పేద్ద పేరున్న (పొడుగులో కాదు — ప్రఖ్యాతిలో) రచయిత్రికథ చూపిస్తూ అన్నాడు:

'ఏమిటి గురూ ఇది? బ్యాడ్‌నాన్సెన్స్. ఇది కథేనా? బోర్! కాస్త పేరుంటే చాలు — చెత్త రాసినా కొత్తగా ఉందని అచ్చొత్తించేస్తారు ఎడిటర్లు. ఎంత గొప్పగా వ్రాసినా క్రొత్తవాళ్ళని ఎంకరేజి చెయ్యరు.' (కాలని) నిప్పులాంటి నిజం! నిండుగా ధ్వనించింది. మేం కలిసి ఉన్న ఆ ఏడాదిలోనూ, అలాంటి కథలు నాకు సుబ్బారావు చూపించినవి కొల్లలు.

అయితే, సుబ్బారావు విమర్శించటం కేవలం ఆ కథలు బాగులేకకాదు. అంతకంటె బావున్నాయని తాననుకుంటున్న (నిజంగా కొన్ని బావున్నాయని నేనూ అనగల్ను) తన కథలు పడలేదే అన్న ఆక్రోశం. మరి తను రచయిత కాలేదేమోనన్న ఆవేదన.

మరో రాత్రి పడుకోబోయే ముందు నెమ్మదిగా అన్నాడు సుబ్బారావు:

'రచయిత గురూ! నేను రిసెర్చిచేసి ఇంకో చిన్నరహస్యం భేదించాను. కథ పడాలంటే కిటుకు—ఎంత మంచి కథైనా ఏ శ్యామసుందర్ అనో, మధురాధర్ అనో, అచ్యుతకుమార్ అనో వ్రాసి పంపితే, ప్చ్! నోయూజ్. అదే పుష్పల, అప్పలమ్మ పేరుతోనో, బొండాడ పిచ్చమ్మ పేరుతోనో వ్రాసిపంపించు, నెల తిరక్కుండా పడుతుంది. లేదా ఏ జంషెడ్‌పూర్ నుండో,

# సుబ్బారావూ-సన్మానం

పూనానుండో వ్రాసి పంపించు, ష్యూర్! కథ అచ్చవ్వాలంటే (సాధారణంగా) వ్రాసింది ప్రవాసి అయినా కావాలి. లేదంటే ఆడదైనా అయ్యుండాలి. (దానికి ఆవిడ కథ రాయక్కర్లేదు — ఎలా రాయాలో కూడా తెలియనక్కర్లేదు. రాసేది మగాడు. ఆడ పేరు మాత్రం ఆమెది. దట్సాల్!)

రచయితల గురించి సుబ్బారావు ఏం మాట్లాడినా నేను విమర్శించే వాడిని కాదు. కారణాలు రెండు. ఒకటోది అతను చెప్పేవన్నీ నగ్నసత్యాలు. రెండోది— ఖండిస్తే నేనూ రచయితనేనని, మొహమాటం లేకుండా (అది ఎందుకుండాలి? అంటాడు) నా మీద నిర్దాక్షిణ్యంగా విరుచుకు పడటంలో, ఆరడుగుల గలివర్ లాంటి సుబ్బారావు క్షణం ఆలస్యం చేయడన్నది నిర్వివాదాంశం. ఒకటి రెండు సందర్భాలలో నాకిది అనుభవమే.

రాను రాను సుబ్బారావులో మార్పు వచ్చింది. పూర్తిగా డీలాపడి పోయాడు. తన రచన ఇంక వెలుగులోనికి రావని (ఏదో మూల చిన్న ఆశ ఉన్నా) నిశ్చయించుకొని (అయిష్టంగానే) నిరాశపడి పోసాగాడు. నాకు జాలివేసింది. నిజం చెప్పొద్దూ! సుబ్బారావు అప్పుడప్పుడూ మంచి కథలుకూడా వ్రాసేవాడు. అవి తిరిగి వచ్చేసినప్పుడు నాకూ ఒళ్ళుమండేది ఆయా సంపాదకులమీద — లెఫ్ట్ రైట్ — అదటుంచండి.

ఇప్పుడు నా ముందున్న సమస్య ఒక్కటే. సుబ్బారావు రచయిత కావాలి.

సుబ్బారావుని రచయితను చెయ్యాలి— ఎలా?

నాకో పత్రికైనా (స్వంతంది) లేదే? నేనో ప్రతిక్క ఎడిటర్నైనా కానే? ఎలా?

ఓ సారి (అది ఒకటోసారి కాదు) నా కథ ఒక ప్రముఖ పత్రికలో పడింది. ఆ నాడు సుబ్బారావు నాకో చిన్నపార్టీ చేసి, సినిమాకు తీసుకెళ్ళి నానా సంబరపడి పోయాడు. కిం కారణం?— ఆ కథకు ముందు నేను వ్రాసిన రెండే రెండు లైన్లు. ఏమిటవి?

'ఈ కథకు ప్లాట్ వేసుకోవటంలోనూ వేసుకున్న ప్లాట్‌ను కథానుగుణంగా మధురంగా మలచుకోవటంలోనూ నాకు పూర్తిగా సహకరించిన ప్రియమిత్రుడు పి. వి. సుబ్బారావుకి నా కృతజ్ఞతలు'

తన కథే పడినంత సంతోషపడ్డాడు. నాకీ సంఘటన కాస్త ఉత్సాహం కలిగించింది. మళ్ళీ చాలా రోజులకి సుబ్బారావులో ఆనందం కనిపించింది. ఇదే బావుంది! అలా అయిదారు కథలలో క్రమం తప్పకుండా సుబ్బారావు నాకు సహాయం చేసినట్లు వ్రాశాను. అవి అచ్చయ్యాయి. నాతోపాటు సుబ్బారావునుకూడా అభినందిస్తూ లేఖలు రాసాగాయి.

ఓ రోజు—

సుబ్బారావు ఆనందంలో మేను మరచి, భూమ్యాకాశాలకు నడుమ సంతోషంగా సంచరించి, పరవశించి పోయిన రోజు— ఉపోద్ఘాతం లేకుండా నాకో బ్రహ్మాండమైన విందు చేశాడు. భుక్తాయాసం నుండి నేను తేరుకోకముందే వీక్లీ తీసి మధ్యపేజీల్లో రంగురంగుల చిత్రంతో ప్రింటయిన తన కథను, దిగువున తాటికాయలంతేసి (ఇందులో అతిశయోక్తి ఉందని నే నొప్పుకుంటాను) అక్షరాలతో తన పేరునూ చూపించాడు. ఆనందంతో నాగుండె ఆగినంత పనైంది. మరి సుబ్బారావు ఈ లోకంలోనే లేడు. రచయితైపోయినట్లే...ఫీలయ్యాడు.

మరుసటివారం వీక్లీలో సుమారు పది ఉత్తరాలున్నాయి — సుబ్బారావు కథ చప్పగా, చప్పగా ఉందని, అలాంటి కథ ప్రచురించిన సంపాదకుల అభిరుచి 'మీన్'గా ఉందనీ. నిజంగా నాకు బాధనిపించింది. సుబ్బారావు కోపంగా ఆ వీక్లీని చిత్రవధచేసి (కొత్త పనామా బ్లేడులతో) దహన సంస్కారం జరిపించాడు.

ఇంకోవారం గడిచింది.

ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు లంచ్‌బ్రేక్‌లో రూమ్‌కి వెళ్ళేసరికి సుబ్బారావు ఏడుస్తున్నాడు. ఆశ్చర్యపోయాను.

'గురూ! నువ్వు చెప్పు. ఆ కథ నిజంగా నేనే స్వంతంగా వ్రాయలేదూ?' ఆల్మోస్ట్ ఆడదానిలా భోరున ఏడుస్తూ (కొప్పడకండి పొరపాటు. ఈ రోజుల్లో

అడాళ్ళు ఏడకటంలేదు. వాళ్ళు ఏడ్పిం ఛగా, మగధీరులే ఏడుస్తున్నారు) అడిగాడు నన్ను. 'ఆ కథ'—అంటే ప్రింటయిన ఆ ఏకైక కథానికేనని నా కర్థమైంది.

'లేదని ఎవరన్నారు ?' అనునయంగా అన్నాను.

'ఎవరేమిటి? ఇది చూడు,' అని పత్రికాధిపతులనుండి వచ్చిన ఉత్తరం నా కిచ్చాడు. అందులో— సుబ్బారావు కథ గతంలో ఇంకో పత్రికలో ప్రింటయిన ఒకానొక కథకు కాపీ అని, ఇలాంటి వైచ్యం తగదని మందలింపు ఉంది.

'పోనీ, నా ఒక్కడికే ఇలా రాస్తే పర్లేదు.' బాధపడూ అన్నాడు సుబ్బారావు, 'చూడు గురూ! ఈ వీక్లీలో ఏం ప్రింట్ చేశారో?'

వీక్లీలోనికి చూపు మళ్ళించాను.

ఏదో కథకు అనుకరణ అని ఒక పాఠకుడు సూచిస్తూ లేఖ వ్రాశాడు. (వీళ్ళకింకేం పనేలేకపోతే సరి! వ్రాయటం చేత కాదు కాని, ఇలాంటి చచ్చు ఉత్తరాలకీ, విమర్శలకీ, రంధ్రాన్వేషణకీ తగుదురు.)

లేఖకు దిగువనే సంపాదకుల సమాధానం:

'పాఠకుడు సూచించిన కథను, శ్రీ సుబ్బారావుగారి కథనూ మేము పరిశీలించగా, ఆ కథకు ఈ కథ పూర్తి అనుకరణ అని గమనించి చాలా చింతించాము. రచయిత ఇలాంటి చౌర్యానికి పాల్పడటం నిజంగా క్షమార్హం కాని నేరం. ఇట్లాంటి అవకతవక పనికి మా పత్రికలో చోటు దొరకటం మా దురదృష్టం.'

ఈ జవాబు నన్నెంతో కలచివేసింది. కథ నిజంగా సుబ్బారావు స్వీయరచనే. పోలికలు యాదృచ్ఛికంగా ఉండి ఉండొచ్చు. ఇదంతా కాకతాళీయమే గాని, కాపీకాదని నాకు తెల్సు. అయినా నా మాటెవరిక్కావాలి కనక?

ఆమాటే అన్నాను సుబ్బారావుతో.

కనీసం నేనైనా నమ్మినందు కెంతో సంతృప్తి చెందాడు.

అంతే! ఆతర్వాత 'సుబ్బారావు చాలా కథలు వ్రాశాడు. కాని, నారాయణ! ఏ ఒక్కటీ అచ్చుకాలేదు. (సంపాదకులకు సుబ్బారావు కథ అంటే భయమ్మో అవమానం కలిగి ఉండాలని నా అంచనా— సుబ్బారావుది కూడా!)

ఇక అసలు కథకుడి కథ—మామూలే!

సుబ్బారావు చిక్కి సగమైపోయాడు. దొంగచాటుగా 'నరిష్మెంట్' కొట్టకుండా 'అంతరాత్మ' సాక్షిగా నిజంగా నిరాహారదీక్షపూని శల్యమైన రాజకీయ నాయకుడిలా, రెండునెలల్లో రెండువదుల పౌన్లు తగ్గాడు. (ఈ స్థితిలో ఒరదుగుల సుబ్బారావు పోల్‌వాల్ట్ గడలా ఉండి ఉంటాడని పాఠకులు గ్రహించే ఉంటారు.) తానొక ప్రముఖరచయిత కాకపోతే ఆ బెంగతో చచ్చిపోతాడేమో ? (పోడుగాని. పోతాడేమో అనిపించింది నాకు.)

ఎలా ? సుబ్బారావు నెలా రచయితను చెయ్యటం ??

సంవత్సరం గడచిపోయింది. నాకు బెజవాడ ట్రాన్స్‌ఫర్ అయ్యింది! ఆ తర్వాత మరి సుబ్బారావుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగలేదు. (ముందే విన్నవించుకున్నాను కూడా, సుబ్బారావుకి ఉత్తరాలు వ్రాసే అలవాటు లేదని.)

ఇప్పుడు...

నేను బెజవాడ వచ్చేసి అప్పుడే అయిదేళ్ళు దాటింది. ఉద్యోగం రిజైన్ చేసేసి (పెళ్ళికాగానే రిజైన్ చేసేశాను —ఆశ్చర్యంగా ఉందా? లక్షరూపాయల ఆస్తి కలిసొస్తే రిజైన్ చేసెయ్యనూమరి!) మూడేళ్ళు దాటింది.

సుబ్బారావింకా శ్రీకాకుళంలోనే ఉన్నాడు.

ఆ సుబ్బారావే ఈవాడు ప్రముఖ రచయితై వెలుగుతున్నాడు. ఆ సుబ్బారావుకే ఈవాడు సన్మానం.


అయితే—ఆనాటి ఆ సుబ్బారావు ఈ అరవై నెలల స్వల్పకాలంలో ప్రముఖ రచయితెలా అయ్యాడు ?

...నాకు తెలుసు. చెప్తా వినండి.

అనగనగా ఓ పట్నం. ఆ పట్నంపేరు బెజవాడ. [విజయవాడ అనుకున్నా తప్పులేదు]. ఆ పట్నంలో సుబ్బారావుకో మిత్రుడుండేవాడు. ఆ మిత్రుడిపేరు 'పూర్వాభాద్ర.' ఇది కలంపేరు. అసలు పేరేమిటో సుబ్బారావుకే తెలుసోలేదో ? (పూర్వాభాద్ర తన మిత్రుడని అసలు కథానాయకుడు సుబ్బారావుకి తెలీదు!)

సదరు పూర్వాభాద్ర ఓ పెద్దరచయిత. (రచయితకాని సుబ్బారావుకి స్నేహితులందరూ రచయితలే కావటం గమనార్హం.)

ఆ పూ.భా.కు బెజవాడలోని ఓ ప్రముఖ పత్రికాధిపతి కమ్ ఎడిటర్ తెలుసు. రోజూ సాయంకాలం ఈ ఎడిటర్‌గారూ, పూ.భా.గారు కలిసి ఆ పత్రికకి వచ్చిన



[illegible] పరిశీలించి ఎన్నిక చేస్తుంటారు' (పూ.భా.గారు ఉద్యోగి. సాయంకాలంపూట ఆయనకిదో హాబీ.)

నో రోజు పత్రికకి వచ్చిన రచనలను పరిశీలిస్తుండగా అందులో పచ్చపులను వెంకటసుబ్బారావు నామధేయుడు వ్రాసిన కథ ఈ పూ. భా. కంటపడింది. అది చూసి 'ఆరె! నా మిత్రుడు పి. వి. సు. రావు వ్రాసిందే'నని బోల్నంత ఆశ్చర్యపోయి, చదివి తలనొప్పిని (నిస్సందేహంగా కథ చదువుతుంటే వచ్చిందే) భరించి, ఎడిటర్‌గారితో ఘర్షణగా వాదించి ఆ కథను బలవంతాన ప్రచురింప చేశాడు. (పి. వి. యస్‌కి రచయిత కావాలనే బలమైన కోర్కె ఉందని, రచయిత కావటానికి అతడు పడ్డపాట్లు—పూ. భా. కి తెల్సు కనుక.)

# సుబ్బారావు-సన్మానం

ఏ కథకూ, ఏ రచయితకూ రాని ఉత్తరాలొచ్చాయి ఆ కథకు పాఠకులనుండి. కాని, అన్నీ తిట్టూ వచ్చినవే. ఈ లేఖా వనిని పోస్టేజి భరించి రచయిత్రి సుబ్బారావుకి పంపించారు పూ.భా.గారు. (నీ కథ బాగులేకపోయినా మైత్రికొద్ది ప్రచురించినా) పిల్లిసన్నాసి—అని చెప్పటానికి. కాని, సుబ్బారావుకి ఈ పూ.భా. ఎవరో తెలీదు.)

సుబ్బారావు రెండో కథ పంపించాడు. పడింది.

మళ్లీ పంపి వాడు. మళ్లీ పడింది.

పాఠకుల విమర్శలుమాత్రం తగ్గ దు. అయినా పూ. భా గారు మిత్రుని కథ మ విడవకుండా ప్రచురించారు (ఎడిటర్ గారితో రికమెండ్‌చేసి). ఇలా రెండున్నర సంవత్సరాల కాలంలో ఆ పత్రికలో సుబ్బారావు కథలు నలభైఆరు పడ్డాయి. క్రమంగా సుబ్బారావు రచయితగా స్థిరపడ్డాడు. విమర్శలు రావటంలేదు అప్పుడప్పుడైనా కొంచెమయినా ఉత్తరాలు ప్రశంసిస్తూ వస్తాయి కూడా!

అయినా సరే సుబ్బారావు తన్నాదరించిన ఆ ఒకే ఒక పత్రికకు తప్ప ఇతర చప్పు పత్రికలకు (సుబ్బారావు దృష్టిలో తన రచనలను గౌరవించని నన్నీ చప్పు పత్రికలే!) తన రచనలను పంపటానికి ఇష్టపడలేదు

నంక్రో సర్కార్లకి పత్రిక ధిటి మర నిమూ తన పత్రికను పూర్వాభాద్రకు అప్పగించాడు (అంతకు ఆ ర్పెల్ల ముందే తన పుత్రికను కూడా పూ.భా.కి సమర్పించి ఉండటం వలన)

ఇప్పుడు ఆ పత్రికకు పూ. భా. గారే ఎడిటర్. ఇక సుబ్బారావు కథలు అచ్చు కావటానికి తిరుగేలేదు.

... ఈనాడు సుబ్బారావు పరిణతి పొందిన రచయిత. ఏ పత్రికలో చూసినా అతని కథలే ఎందులో చూసినా అతని రేయాలే. వ్యాసాలు, విమర్శలు, నవలలు, నాటకాలు— ఒకటేమిటి? అన్నిట్లోనూ సుబ్బారావు పేరే!

ఆ సుబ్బారావుకే సన్మానం.

సన్మానం విజయవంతంగా ముగిసింది.

సుబ్బారావు కోరిక నెరవేరింది. తానొక ప్రముఖ రచయితై ... పోయాడు. తనకింకేం అక్కర్లేదు. కాని ఒక్కటి మాత్రం తన జీవితంలో మర్చిపోలేదు. ఈ స్థితికీ, తన ఈ ఉన్నతికీ కారణం కేవలం ఆ పత్రిక, దాని ఎడిటర్ (పూ. భా.) మాత్రమే!

అందుకే సన్మానార్థియై శ్రీకాకుళం నుండి కాకినాడ వచ్చిన సుబ్బారావు ఎడిటర్‌గారి పట్ల, ఆతని పత్రికపట్ల తనకుగల గౌరవాన్ని, కృతజ్ఞతను వ్యక్తీకరించుకునేందుకు బెజవాడ వెళ్ళాడు.

గాంధీనగరంలోని ఆఫీసును సులభంగా తెలుసుకో గలిగాడు. స్ప్రింగ్ డోర్స్ తెరచుకొని లోపలికి ప్రవేశించాడు

లోనికి ప్రవేశిస్తూనే—ఎడిటర్ సీటో పూర్వాభాద్రగా కలంపేరు పెట్టుకొన్న నన్నుచూసి —

[illegible]

---

తూరలూ గుణాలూ!

## ముల్లంగి

లేతగానున్న ముల్లంగి దుంపకూర త్రిదోషాలను హరిస్తుంది. మూత్ర వ్యాధి. గుల్మరోగం, నేత్రరోగం, శ్వాసకాసలు, క్షయరోగం, గళరోగం కలవారికిది మేలుచేస్తుంది. మూత్ర పిండములు వికృతినిపొంది పొత్తి కడుపున చేరియుండుటవలన మూత్ర నిరోధం కలిగి మూత్రం అతికష్టంగా అయ్యేడలెడిరోగం గలవారికి మేలు చేస్తుంది. అజీర్ణం, దద్దుర్లు, వాతం, పీనస వ్యాధులను జయిస్తుంది. మూత్రం బాగా జారీ అయేట్టు చేస్తుంది.

గొంతుకకు, బుద్ధికి నష్టం కలుగజేస్తుంది.

ముదిరిన ముల్లంగి దుంపకూర దురదను, కఫాన్ని, త్రిప్పరోగాన్ని పోగొడుతుంది. మిక్కిలి జఠరదీప్తి నిస్తుంది.

అతిగా తింటే గురుత్వం గా వుంటుంది. శోష, కాస, నీరసం, పైత్యం, వాతం కలుగజేస్తుంది. కడుపునొప్పి పుట్టిస్తుంది. రక్తాన్ని పాడుగొడుతుంది. గొంతుకకు, తలకు నష్టాన్ని కలుగజేస్తుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్లు!—
1. తేనె, 2. జీలకర్ర, 3. ఆవపిండి, 4. ఉప్పు.

## చిరగడ దుంప

చిర్ర చిరగడదుంప ఎక్కువ చలువ చేస్తుంది. రక్తాన్ని వృద్ధిచేస్తుంది క్షుద్బాధని నివారిస్తుంది.

కడుపులో వాతాన్ని బంధిస్తుంది. వాతం, గురుత్వం, శ్లేష్మం, పైత్యం చేస్తుంది. కడుపులో నొప్పి పుట్టిస్తుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్లు:—
1. పంచదార, 2 పాలు, 3. ఉప్పు.

తెల్ల చిరగడదుంపకూర స్వాదుగ వుంటుంది. చలవచేస్తుంది. గురుత్వం చేస్తుంది. శ్లేష్మాన్ని పెంచుతుంది. బలహీనులకిది అవథ్యమయిన కూర.

దీని దుర్గుణాలకు విరుగుళ్లు:—
1. నెయ్యి, 2. పంచదార, 3. బెల్లం, 4. పులుసు, 5. కల్లు, 6. తమలపాకు, 7. మఱ్ఱిచెట్టు కాల్చి చేసిన క్షారము.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి.